క్లుప్తంగా

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న తీర ప్రాంత ప్రజల ఆరాధ్య దేవత బండి ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని, ప్రసాదాలు స్వీకరించారు. మొక్కు బడులైన ధూపహారం, కుంభాహారాలను అమ్మవారికి నివేదించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద భక్తులకు కావలసిన సదుపాయాలను ఆలయ కమిటీ చైర్మన్ కడలి ధర్మారావు, ఈవో ఎం.అరుణకుమార్ పర్యవేక్షించారు.

ఏకాంబరేశ్వరునికి అన్నాభిషేకం


ఏకాంబరేశ్వర స్వామి

పెనుగొండ: ఏకాంబరేశ్వరస్వామికి భక్తి శ్రద్ధలతో అన్నాభిషేకం నిర్వహించారు. ఆదివారం పెనుగొండలోని కంచి కామాక్షి ఆలయంలో ఏకాంబరేశ్వరస్వామికి ఉదయం నుంచి అభిషేకాలు, అర్చనలు నిర్వహించిన అనంతరం అన్నాభిషేకం ఆలయ అర్చకుడు కొండవీటి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సర్వీస్ నిబంధనలపై అవగాహన తప్పనిసరి


జి.సత్యనారాయణ

పాలకొల్లు అర్బన్: ఉద్యోగుల సర్వీస్, సెలవు నిబంధనలు, ఆఫీస్ మ్యాన్యువల్ తదితర అంశాలపై పూర్తి అవగాహన ఉండాలని సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్ జి.సత్యనారాయణ, ఎ.రవివర్మ చెప్పారు. పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాలులో ఆదివారం ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పలు అంశాలపై వివరణాత్మకంగా విశ్లేషించారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవోలను క్షుణ్ణంగా పరిశీలించి అవగాహన చేసుకోవాలన్నారు. తెలియని విషయాలను సీనియర్ ఉద్యోగులను అడిగి తెలుసుకుని ప్రభుత్వానికి సంతృప్తికరమైన సేవలందించాలన్నారు. సంఘ నాయకులు జీఆర్ఎస్ఎన్ రాజు, ఉమర్ ఆలీషా, వి.సునీల్‌కుమార్, పి.కృష్ణకిషోర్, పీఎస్ చంద్రమౌళి, కేదారీశ్వరరావు, గిరిప్రసాద్‌వర్మ, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపుల లాటరీ ప్రక్రియ వాయిదా

తాడేపల్లిగూడెం (టీఓసీ): గీత సామాజిక వర్గానికి కేటాయించిన నాలుగు మద్యం షాపులకు ఈనెల 10న జరగాల్సిన లాటరీ ప్రక్రియ వాయిదా పడినట్లు ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి అన్నారు. ఆదివారం తాడేపల్లిగూడెంలో ఆమె ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో లాటరీ ప్రక్రియ వాయిదా వేసినట్లు చెప్పారు. ఎన్నికల కమిషన్ అనుమతి అనంతరం లాటరీ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు.

మద్యం దుకాణాల దరఖాస్తుల లాటరీ వాయిదా

తణుకు అర్బన్: తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలో కల్లుగీత వర్గాలకు కేటాయించిన 5 మద్యం దుకాణాలకు సంబంధించి అందజేసిన దరఖాస్తుల లాటరీ ప్రక్రియ వాయిదా పడినట్లు ఆ శాఖ సీఐ సత్తి మణికంఠ రెడ్డి తెలిపారు. సోమవారం భీమవరంలో జిల్లా కలెక్టర్ సమక్షంలో నిర్వహించాల్సి ఉన్న లాటరీ ప్రక్రియ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సందర్భంగా వాయిదా పడినట్లు చెప్పారు. ఎలక్షన్ కమిషన్ నిర్ణయం మేరకు లాటరీ ప్రక్రియ నిర్వహించే తేదీని తెలియపరుస్తామని దరఖాస్తుదారులు గమనించాలని కోరారు.

పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం

భీమవరం : పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక పీఎస్ఎం గరల్స్ హైస్కూల్లో ఆదివారం నిర్వహించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.వీ సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై యూనియన్ చేసిన కృషిని వివరించారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డీఏ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఐఆర్‌ను వెంటనే ప్రకటించి, రాబోయే ఉపాధ్యాయ బదిలీల్లో విద్యా సంవత్సరాన్ని ప్రామాణికంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, నాయకులు సీహెచ్ ఈశ్వరరావు, టి.గణపతి, కె.రామాంజనేయులు, పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

- పట్టించుకోని పాలకులు
- గత వైఎస్ జగన్ సర్కార్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మంజూరు
- ప్రభుత్వం మారడంతో అటకెక్కిన ప్రాజెక్ట్


బస్టాండ్ పక్కన అధ్వానంగా ఉన్న డ్రైనేజీ

నరసాపురం: ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా నరసాపురం పట్టణం డ్రైనేజీ వ్యవస్థ నానాటికీ క్షీణిస్తోంది. ప్రణాళికా బద్ధంగా డ్రైనేజీ నిర్మించకపోవడం, పనుల్లో నాణ్యతా లోపాలు పరిస్థితిని మరింత దిగజార్చాయి. మొత్తానికి డ్రైనేజీ వ్యవస్థపై ఖర్చు చేస్తున్న ప్రజాధనం అంతా వృథా అన్నట్లుగా పట్టణంలో ఏ డ్రైనేజీని చూసినా అర్థమవుతుంది. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళనకు భారీ ప్రాజెక్టును గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరు చేసినా కూడా ప్రభుత్వం మారడంతో పనులు కొనసాగే అవకాశం లేకుండా పోయింది. డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం, మరమ్మతుల కోసం పట్టణంలో గడిచిన ఐదేళ్లలో రూ.15 కోట్లపైనే ఖర్చు చేశారు. 2015 పుష్కరాల్లోనే ఏకంగా రూ.6 కోట్లు ఖర్చు చేశారు. అయితే ఇంత ఖర్చు పెట్టినా పట్టణంలో ఏ డ్రైనేజీని చూసినా అధ్వానమే. నాణ్యతా లోపాలతో చాలా డ్రెయిన్లు శిథిలమయ్యాయి.

డ్రెయిన్లన్నీ అధ్వానం

ప్రస్తుతం పట్టణంలో చాలా ప్రాంతాల్లో డ్రైనేజీ ఇబ్బందులున్నాయి. పట్టణంలో బస్టాండ్ సెంటర్, మాధవాయిపాలెం, రాయపేట, రుస్తుంబాద ప్రాంతాల్లో ప్రధాన డ్రైనేజీలున్నాయి. వార్డులోని పలు వీధుల్లో ఉప డ్రెయిన్లు ఈ ప్రధాన డ్రైనేజీల్లో కలుస్తాయి. ప్రధాన డ్రెయిన్లు గోదావరిలో ఐదు చోట్ల కలుస్తాయి. మురుగు గోదావరిలో కలిసే చోట ఔట్‌పాల్ స్లూయిజ్‌లు కూడా సరిగా లేవు. గోదావరిలో మురుగు కలిసే చోట అవుట్ లెట్‌లు సరిగా లేకపోవడంతో ఆ ప్రాంతం బురదమయంగా మారుతుంది. ఇక డ్రైనేజీలు అధ్వానంగా ఉండడంతో వర్షం వస్తే బస్టాండ్ ఏరియా, పొన్నపల్లి, నందమూరి కాలనీ, వైఎస్సార్‌నగర్ ప్రాంతాలు వర్షం నీరు పారక నీట మునుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో వర్షపు నీరు సవ్యంగా పారేటట్లు డ్రైనేజీలను ఆధునీకీకరించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే 21, 22, 23, 24, 25, 26, 27 వార్డులు, పొన్నపల్లి, మాధవాయిపాలెం, స్టేషన్‌పేట ప్రాంతాల్లో మైనర్ డ్రెయిన్లు వెంటనే మరమ్మతులు చేయాల్సి ఉంది.

అటకెక్కిన స్పెషల్ ప్రాజెక్ట్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నరసాపురం మున్సిపాలిటీలో రూ.220 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆర్థిక శాఖ అనుమతులతో పనులు మొదలు పెట్టడానికి మొదటి విడతగా రూ.50 కోట్లు మంజూరు చేసింది. ప్రాజెక్ట్‌లో భాగంగా గత ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ముందుగా ఒకటి నుంచి తొమ్మిది వరకూ వార్డుల్లో పనులు మొదలు పెట్టడానికి టెండర్లు పిలిపించారు. అయితే ఎన్నికల కోడ్ రావడం, తరువాత ప్రభుత్వం మారడంతో ఈ ప్రాజెక్ట్ అటకెక్కింది.

పట్టణ జనాభా	60వేలు
విస్తీర్ణం	11.275 చదరపు కిలో మీటర్లు
డ్రెయిన్ల విస్తీర్ణం	25.450 కిలోమీటర్లు
పక్కా డ్రెయిన్లు	12. 697 కిలోమీటర్లు
కచ్చా డ్రెయిన్లు	8.493 కిలోమీటర్లు
మేజర్ డ్రెయిన్లు	4.260 కిలోమీటర్లు
నిర్మించాల్సిన డ్రెయిన్లు	4 కిలో మీటర్లు

అండర్ గ్రౌండ్ డ్రైనేజీయే శరణ్యం



నరసాపురం మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థలో మొదటి నుంచి లోపాలు ఉన్నాయి. గోదావరి నీటి మట్టానికి పట్టణం ఉంటుంది. కాబట్టి ఇక్కడ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ చాలా అవసరం. దీనిని దృష్టిలో పెట్టుకునే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూ.220 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పారు. మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఈ ప్రాజెక్ట్ కోసం చాలా కృషి చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నించాలి. ఇది ప్రజలకు చాలా అవసరం.

బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ వైస్ పర్సన్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలంలోని కేపీపాలెం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈ నెల 10వ తేదీ సోమవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఎలక్ట్రికల్ ఈఈ కె.మధుకుమార్ తెలిపారు. కేపీపాలెం నార్త్, సౌత్, పేరుపాలెం నార్త్, సౌత్ గ్రామాలకు అంతరాయం విద్యుత్ సరఫరాలో కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్డీవో దాసి రాజు చెప్పారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం పదిన్నర గంటల నుంచి అందించాలని చెప్పారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

భీమవరం(ప్రకాశం చౌక్): కార్మికులపై అధికారుల వైఖరి దారుణంగా ఉందని నేషనల్ మజ్దూర్ యూనియన్ జోనల్ ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు విమర్శించారు. గ్యారేజీ మెకానిక్ సస్పెన్షన్‌ను ఖండిస్తూ డిపో సమీపాన ఆదివారం నిర్వహించిన రిలే దీక్షలు నాలుగోరోజు కొనసాగాయి. యూనియన్ జిల్లా కార్యదర్శి వై.వి.రావు, రాష్ట్ర యూనియన్ కార్యదర్శి పి.సోమరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూనిక్ ఐడీ

యలమంచిలి: వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ (డిజిటలైజేషన్) చేయుటకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడీ) కేటాయిస్తుందని మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డ్ తరహాలోనే రైతులకు ప్రత్యేకంగా ఈ కార్డు ఇస్తారని ఆమె తెలిపారు. కనుక ప్రతి రైతూ (సొంత భూమి గల రైతులు మాత్రమే) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పలు పథకాలు, రాయితీలు పొందాలంటే 14 అంకెల విశిష్ట సంఖ్య (ఫార్మర్ రిజిస్ట్రీ) తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఆమె కోరారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పెట్టుబడి రాయితీ, ఎరువుల రాయితీ, పంటల బీమా, కనీస మద్దతు ధర, పంట రుణాలు, పలు రకాల వ్యవసాయ అనుబంధ సేవలు పొందాలంటే తప్పనిసరిగా ఈ కార్డు తీసుకోవాలని ఆమె కోరారు. సొంత భూమి కలిగిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్సు లేదా 1బి జిరాక్సు, ఆధార్ జిరాక్సు, ఆధార్ నంబర్‌కు లింక్ అయిన ఫోన్ తీసుకుని రైతుసేవా కేంద్రం వద్దకు వెళ్లాలన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి

భీమవరం(ప్రకాశం చౌక్): ప్లాస్టిక్ నిషేధాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని భీమవరం బాలుర బీసీ హాస్టల్ వార్డెన్ కడలి శ్రీనివాస్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించి దాతల సహకారంతో హాస్టల్‌కు స్టీల్ గ్లాస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని అందరూ సమష్టిగా సహకరించాలన్నారు. పోలీస్ బొమ్మ సెంటర్ నుంచి ప్రకాశం చౌక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.

ఇటు వేగం.. అటు ఆలస్యం

- ఆచంట నియోజకవర్గంలో భిన్న పరిస్థితులు
- కొనసాగుతున్న వరి నాట్లు


ఆచంట వేమవరంలో రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారులు


ఆచంట వేమవరంలో ఇంకా కొనసాగుతున్న వరి నాట్లు


పెనుగొండలో దుబ్బు దశలో వరి చేలు

పెనుగొండ: దాళ్వా సాగులో ఆచంట నియోజకవర్గంలో భిన్న పరిస్థితులు నెలకొన్నాయి. పెనుగొండ, పెనుమంట్ర మండలాల్లో వరినాట్లు పూర్తై 20 రోజులు దాటుతుండగా, ఆచంట, పోడూరు మండలాల్లో ఇంకా వరినాట్లు కొనసాగుతున్నాయి. ఈ సీజన్‌కు పెనుగొండ మండలంలో 11782 ఎకరాల్లోనూ, పెనుమంట్ర మండలంలో 12103 ఎకరాల్లోనూ వరి నాట్లు పూర్తి చేశారు. ఆచంట మండలంలో 10100 ఎకరాల్లో వరి నాట్లు పూర్తికాగా, మరో 500 ఎకరాల్లో నాట్లు పడాల్సి ఉంది. అదే విధంగా పోడూరు మండలంలో 12800 ఎకరాల్లో వరినాట్లు పూర్తికాగా, మరో 300 ఎకరాల్లో నాట్లు పూర్తి కావాలి. సాధారణంగా దాళ్వా సీజన్‌లో వరినాట్లు సంక్రాంతి పండుగ నాటికి పూర్తి చేయడానికి వ్యవసాయ శాఖ, రైతులు కృషి చేస్తుంటారు. ఏమాత్రం ఆలస్యం చేసినా ఎండల తీవ్రత పెరిగి నీటి ఎద్దడి ఏర్పడుతుంది. దీంతో ముందస్తు సాగు పూర్తి చేయాలని ప్రయత్నిస్తారు. కాని, ఈ సారి ఆచంట, పోడూరు మండలాల్లో గత సీజన్‌లో ఆచంట వేమవరం, వల్లూరు, పోడూరు మండలాల్లో కొన్ని గ్రామాల్లోనే తుఫాన్‌ల తాకిడితో రెండు, మూడు సార్లు వరినాట్లు వేశారు. దీంతో గత సాగు నెల రోజులు పైగా ఆలస్యంగా చేతికందింది. దీంతో దాళ్వా సాగు ఆయా ప్రాంతాల్లో ఆలస్యమవుతుంది. పెనుగొండ, పెనుమంట్ర మండలాల్లో సంక్రాంతి దాటిన వారంలోనే నాట్లు పూర్తి కావడంతో వరి చేలు దుబ్బు దశలో ఉన్నాయి. మరో పది రోజుల్లో చిరుపొట్ట దశకు చేరుకోవచ్చని రైతులు అంచనా వేస్తున్నారు.

వరి నాట్లు ఆలస్యంతో నష్టం

ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో గత సీజన్‌లో తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా నష్టపోయారు. మరలా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శివారు ప్రాంతాలు కావడంతో ప్రతి సీజన్‌లో సాగు నీటి కోసం ఇబ్బందులు పడుతుంటారు. ఈ సీజన్‌లో మరింతగా ఇబ్బంది పడాలని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే వంతుల వారీ విధానం పెట్టడంతో, శివారు ప్రాంతాల్లో నాట్లు పూర్తయ్యేటప్పటికి నీటి ఇబ్బందులు తప్పవని భావిస్తున్నారు. పొట్ట దశకు చేరే లోలపు నేల తడిచే అవకాశాలు ఉండవని చెబుతున్నారు. అధికారులు ముందస్తు ప్రణాళిక రూపొందించి ఆయా ప్రాంతాల రైతులను ఆదుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

దుబ్బు దశలో వరి చేలు



పెనుగొండ మండలంలో వరి చేలు దుబ్బు దశలో ఉన్నాయి. ఇప్పటికే వంతుల వారీ విధానం ప్రారంభించారు. ఎండల తీవ్రత పెరుగుతున్నందున నీటి ఇబ్బందులు రాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం నీటి కొరత లేదు. రాబోయే రోజుల్లో రాకుండా చర్యలు తీసుకోవాలి

–నల్లిమిల్లి వేణుప్రతాప రెడ్డి (బాబిరెడ్డి), రైతు, పెనుగొండ

రైతులకు సూచనలు ఇస్తున్నాం



వరుస తుఫాన్లు, నక్కల డ్రెయిన్ ఉద్ధృతితో గత సీజన్ ఆచంట వేమవరం పరిసర ప్రాంతాల్లో మాసూళ్లు ఆలస్యంగా పూర్తయ్యాయి. దీంతో దాళ్వా సాగు అక్కడ ఆలస్యమైంది. రైతులు ఇబ్బందులు పడకుండా నిత్య పర్యవేక్షణ చేస్తూ సూచనలు ఇస్తున్నాం. సాగు నీరు సమృద్ధిగా ఉంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

–బి.నాగరాజు, ఏవో, ఆచంట

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి

జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు


ముదునూరి ప్రసాదరాజుకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత కుంచిలపల్లి

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నాయకులు పని చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు కోరారు. వైఎస్సార్‌సీపీ క్రిష్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కుంచిలపల్లి వినిస్టన్‌బాబు ఆదివారం నరసాపురంలో ప్రసాదరాజును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీకి కష్టపడి పని చేయాలని సూచించారు. కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తప్పకుండా గుర్తింపు ఇస్తారన్నారు. ప్రసాదరాజును కార్యక్రమంలో ననమండ వీరాస్వామి, వర్ధనపు కాసు, తదితరులు పాల్గొన్నారు.

గంగా జలంతో రుద్రాభిషేకం


స్వామి వారికి లక్ష బిల్వార్చన పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


ఉమా ఇంద్రేశ్వర స్వామి

పెనుమంట్ర: మహా కుంభమేళా నుంచి తెచ్చిన పవిత్ర గంగా జలంతో పెనుమంట్ర గ్రామంలోని ఉమా ఇంద్రేశ్వరస్వామికి ఆదివారం అభిషేకం నిర్వహించారు. మాఘమాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామి వారికి 11 మంది వేద పండితుల సారథ్యంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం రుద్రహోమాలు అనంతరం సామూహిక లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. పెనుమంట్రకు చెందిన వేద పండితులు చిట్టా రవిశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పరిసర గ్రామాల భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

భగవద్గీత కంఠస్థ పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న పద్మశ్రీ డాక్టర్ ఏంఆర్‌రాజు, మంతెన రామ్‌కుమార్‌రాజు

భీమవరం(ప్రకాశం చౌక్): జువ్వలపాలెంలో ఉన్న డీజేఆర్ సత్రం అనుబంధ పద్మావతీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు యామిజాల ఉమాసోమేశ్వర శర్మ, వేలూరి శ్రీనివాస్, ఎస్. ధనలక్ష్మి, జి.రేవతిలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ భగవద్గీత కంఠస్థ పోటీలను 3 విభాగాల్లో నిర్వహించి మొదటి బహుమతికి రూ.మూడు వేలు, ద్వితీయ బహుమతికి రూ.2వేలు, తృతీయ బహుమతికి రూ.వెయ్యి చొప్పున విజేతలకు పద్మశ్రీ డాక్టర్ ఏంఆర్ రాజు, సత్రం వంశపారంపర్య ధర్మకర్త మంతెనరామకుమార్ రాజు, దంతులూరి రంగరాజు, ఈవో సత్యనారాయణ రాజు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విజేతలైన గన్నాబత్తుల ఓజస్విని, మందూరి రిషీ జ్యోతి, కందుల లీల, కందుల రమ్య, మునగాల విజయ, వెంకటలక్ష్మిలకు బహుమతులు అందజేశారు.

యూటీఎఫ్ ప్రతిభా పరీక్షలు


ప్రతిభా పరీక్ష పత్రాలను విడుదల చేస్తున్న యూటీఎఫ్ ఉపాధ్యాయులు

యలమంచిలి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలంటే విద్యార్థుల్లో ఉండే భయాందోళనలను తొలగించడానికి యూటీఎఫ్ 28 ఏళ్లుగా టాలెంట్ టెస్ట్‌లు నిర్వహిస్తూ విద్యార్థులను ప్రోత్సాహిస్తుందని మండల అధ్యక్షుడు గుత్తిందీవి శ్రీనివాసరావు అన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో పది, ఐదో తరగతుల విద్యార్థులకు ఆదివారం మేడపాడు హైస్కూల్‌లో 28వ యూటీఎఫ్ ప్రతిభా పాటవ పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కోశాధికారి క్రాంతి కుమార్ మాట్లాడుతూ పదేళ్ల కష్టానికి ఫలితం పదో తరగతి పరీక్షలన్నారు. పదో తరగతి ఇంగ్లీష్ మీడియం ప్రశ్నా పత్రాలను ఏకేవీ రామభద్రం తెలుగు మీడియం ప్రశ్నా పత్రాలను సరిపల్లి జయప్రభ ఐదో తరగతి ప్రశ్నా పత్రాలను పులఖండం శ్రీనివాస్ ఆవిష్కరించారు. మేడపాడు హైస్కూల్‌లో పదో తరగతి ఇంగ్లీష్ మీడియంలో 116 మంది, తెలుగు మాధ్యమంలో 20 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాశారు. కొంతేరు, యలమంచిలి, మేడపాడు, చించినాడ, ఏనుగువానిలంక, మట్లపాలెం, ఇలపకుర్రు, దొడ్డిపట్ల, కనకాయలంక స్కూల్ కాంప్లెక్స్‌లో 250 మంది ఐదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏకేవీ రామభద్రం జిల్లా కోశాధికారి పోలిశెట్టి క్రాంతికుమార్ జిల్లా కార్యదర్శి దండు పద్మావతి, నాయకులు సరిపల్లి జయప్రభ, పులఖండం శ్రీనివాస్, డీవీవీ ఆదినారాయణ, అడబాల వెంకటేశ్వరరావు, పిండి శ్రీనివాసరావు, వి.జగ్గారావు, కుడిపూడి సత్యనారాయణ, వర్ధనపు సందీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగు నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

వీరవాసరం: జాతీయ నులిపురుగు నివారణ కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, అంగన్‌వాడీ సెంటర్లలో అమలు జరిపి విజయవంతం చేయాలని సీహెచ్‌వో దేవదాసు కోరారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరోగ్య సిబ్బందికి ఆల్‌బెండజోల్ మాత్రలు అందజేశారు. నేటి నుంచి నుంచి 17వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏడాది వయస్సు నుంచి 19 ఏళ్ల వయస్సు పిల్లలకు ఈ మాత్రలు ఆరోగ్యశాఖ అధికారులు సూచించిన విధంగా అందజేయాలన్నారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

250 మందికి ఉచిత వైద్య సేవలు

పాలకోడేరు: మండలంలోని శృంగవృక్షం గ్రామ పంచాయతీ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యుల సహకాంతో చినపేట లూథరన్ చర్చ్ ఆవరణలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సెయింట్ మేరీస్ హాస్పిటల్, భీమవరం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ మెగా వైద్య శిబిరంలో 250మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జంగం సూరిబాబు, ఉప సర్పంచ్ ఆనంద్ రాజు, డాక్టర్స్ గ్రాజియా లోబో, సిమిలీ, సింధూ, అనిత, కోరుకొల్లు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు 38 గ్రాముల బంగారం సమర్పణ


మావుళ్లమ్మకు బంగారాన్ని అందజేస్తున్న దాతలు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారికి ఆదివారం దాతలు రూ.3 లక్షల విలువ గల 38 గ్రాముల బంగారాన్ని అందజేశారు. అత్తిలికి చెందిన వానపల్లి గంగరాజు ప్రకాష్, సీతా మహాలక్ష్మీ దంపతులు 30 గ్రాములు, కలవపూడికి చెందిన ఎం. చిన వెంకటరాజు, సూర్యకాంతం 4 గ్రాములు, పి దుర్గ ప్రసాదరాజు, శ్రీదేవి 4 గ్రాములు బంగారాన్ని అమ్మవారికి విరాళంగా అందజేశారు. దాతలు ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదగా బంగారాన్ని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మినగేష్‌కు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ దాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.